క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కురుపాం నియోజకవర్గానికి సంబంధించి పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం గురువారం చేపట్టారు. ఈ మేరకు పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా దత్తి మురళీకృష్ణ, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా రాయగడ సూర్యశేఖర్, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా ముంజి సురేష్‌లు నియమితులైనట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

పీసా చట్టంపై అవగాహన తప్పనిసరి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజన హక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన పీసా చట్టంపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని ఆర్ట్స్ డైరెక్టర్ ఎస్.సన్యాసిరావు అన్నారు. కురుపాం ఆర్ట్స్ కార్యాలయం వద్ద పీసా కమిటీ సభ్యులకు పీసా చట్టంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. గిరిజనులు అభివృద్ధి చెందాలన్నా, గిరిజన ప్రాంతాలు ప్రగతి బాట పట్టాలన్నా పీసా చట్టం చాలా అవసరమని దానికి పక్కాగా అమలు చేసుకునే బాధ్యత గిరిజనులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ జిల్లా కో–ఆర్డినేటర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల సంఘ మండల అధ్యక్షుడిగా సుబ్బారావు

సీతంపేట: పెన్షన్‌దారుల సంఘం మండల అధ్యక్షుడిగా కొండగొర్రె సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మన్యం జిల్లా డీటీఓ, పింఛన్‌దారుల జిల్లా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చౌదరినాయుడు, పాలకొండ డివిజన్ సంఘ ఎన్‌జీఓ అధ్యక్షుడు రంగాచార్యులు సమక్షంలో శుక్రవారం ఎన్నిక నిర్వహించారు. సుబ్బారావు ఎన్నిక పట్ల స్థానిక గిరిజన ఉద్యోగ సంఘ నాయకులు కుండంగి కాంతారావు, అప్పారావు, తదితరులు అభినందనలు తెలిపారు.

లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలి

పాలకొండ రూరల్ : జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా అంగన్‌వాడీలు అడుగులు వేయాలని డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా అంగన్‌వాడీ సిబ్బంది నిర్వహిస్తున్న శిక్షణను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కురిటి సోంబాబు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల సర్వతోముఖాభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశా హెచ్‌ఎం ఎం.సూర్యనారాయణ, సీడీపీఓ సిమ్మాలమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులున్నారు.

రహదారిని మెరుగుపరచండి



సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

పాలకొండ రూరల్: మండలంలోని వెలగదాడ మీదుగా రుద్రిపేటకు వెళ్లే రహదారి పూర్తిగా పాడైందని, వెంటనే ఆ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి మెరుగుపరచాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు సబ్ కలెక్టర్ సి. యశ్వంత్‌కుమార్ రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ ప్రాంతానికి చెందిన అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావుతో పాటు యువత ప్రకాష్, చైతన్యకుమార్, తదితరులు సబ్ కలెక్టర్‌ను కలిసి సమస్యలు వివరించారు. అలాగే గ్రామంలో ఉన్న నరసింహ చెరువులో పూడికలు తీయిస్తే సుమారు 12 వందల ఎకరాలకు సాగునీరు అందుతుందని.. ఈ దిశగా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. సమస్యలపై సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని అభ్యుదయ రైతు ప్రసాదరావు తెలిపారు.

విజేతలకు బహుమతులు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లిలో వలంటీర్ బొమ్మాళి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం నిర్వహించిన ఉత్తరాంధ్ర వాలీబాల్ టోర్నీ శుక్రవారంతో ముగిసింది. మూడు రోజులుగా జరుగుతున్న ఈ టోర్నీలో 40 జట్లు పాల్గొనగా.. లీగ్ విధానంలో పోటీలు నిర్వహించినట్లు రిఫరీ ఎన్ని సురేష్ తెలిపారు. పోటీల్లో పాలకొండ మండలం ఎల్ఎల్ పురం క్రీడాకారులు ప్రథమ స్థానంలోను.. వీరఘట్టం క్రీడాకారులు ద్వితీయ స్థానంలోను.. తంపటాపల్లి జట్టు తృతీయస్థానంలో నిలవగా.. నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. పోటీలను చందక జగదీష్‌కుమార్, వంజరాపు ఈశ్వరరావు, జాడ శ్రీధర్, అల్లు సురేష్‌కుమార్, సాయికుమార్, బొమ్మాళి వేణు, రఘు, తదితరులు పర్యవేక్షించారు.

ప్రధాన రహదారిలో జనసందోహం (ఫైల్)



వైఎస్సార్‌సీపీలో.. నూతనోత్సాహం

- మాజీ ముఖ్యమంత్రి పర్యటనపై సర్వత్రా చర్చ
- జనం వేల సంఖ్యలో స్వచ్ఛందంగా తరలిరావడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందం



అభిమానుల సందడి (ఫైల్)

పాలకొండ: రాజకీయ సమావేశం కాదు.. ఎన్నికల ప్రచారం అంతకంటే కాదు.. ఒక వైపు ఎన్నికల కోడ్ అమలులో ఉంది.. మరో వైపు మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఎండ తీవ్రతగా ఉంది.. గ్రామాలకు వాహనాలు ఏర్పాటు చేసి జనాలను తరలించలేదు.. మందు, బిర్యానీ ప్యాకెట్ల ఊసే లేదు.. ఇటువంటి పరిస్థితుల్లో వేలాదిగా జనం తరలివస్తారని ఎవరైనా ఊహించి ఉంటారా.. ఇటు పార్టీ వర్గాలు అటు పోలీస్, ఇంటిలిజెన్స్ అధికారులు కూడా ఊహించలేదు.. కాని మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్‌రెడ్డి పరామర్శలో ఎవరు ఊహించని జనంసందోహం.. ఇప్పుడు దీనిపైనే పాలకొండలో సర్వత్రా చర్చ సాగుతోంది.

అంచనాలు తప్పాయి..

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గురువారం పాలకొండ వచ్చారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉండడంతో పార్టీ వర్గాలు కూడా జనాల తరలింపు కోసం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పోలీసులు కూడా మూడు, నాలుగు వేలకు మించి జనం ఉండరులే అనుకున్నారు. కాని వారి అంచనాలు తప్పాయి. ఎక్కడ చూసినా జనం. అడుగు వేయడానికి వీల్లేని పరిస్థితి. ప్రియతమ నేత జగన్ మోహన్‌రెడ్డిని చూడాలనే ఉత్సాహం, అతనితో ఒక్క ఫొటో దిగడం కోసం ప్రజలు పోటెత్తారు. సీఎం.. సీఎం అంటూ అభిమానుల నినాదాలతో పాలకొండ మార్మోగింది.

వేలాదిగా..

జగన్ మోహన్‌రెడ్డిని చూసేందుకు వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. సుమారు 3 కిలోమీటర్ల వరకు రహదారి పొడవునా చెట్లపైన, మేడలపైన జన సందోహమే. రహదారి పొడవునా ఇదే పరిస్థితి కనిపించింది. విద్యార్థులు, యువత, ఉద్యోగులు, మహిళలు వేలాదిగా తరలివచ్చారు. సుమారు 25 వేల మంది అభిమానులు వచ్చినట్లు ఇంటిలిజెన్స్ అధికారులు అంచనా వేశారు. జగన్‌మోహన్ రెడ్డి సైతం తనపై అభిమానంతో వచ్చిన వారిని నిరుత్సాహ పరచకుండా అందరికీ అభివాదం చేసుకుంటూ వెళ్లారు. జనం మధ్యలోనికి వెళ్లి వారితో ఫొటోలు దిగారు.

నూతనోత్సాహం..

ఊహించని రీతిలో అభిమానులు తరలిరావడంతో పాలకొండ వైఎస్సార్‌సీపీ నాయకుల్లో నూతనోత్సాహం కనిపించింది. ఒక వైపు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం.. అక్రమ కేసులు పెట్టడం.. దౌర్జన్యాలు చేయడంతో ప్రజలు విసుగెత్తుతున్న తరుణంలో జగన్ మోహన్‌రెడ్డి రావడం వారిలో మనోబలం నింపింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

సోషల్ మీడియాలో ట్రోల్స్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలకొండ పర్యటనకు జనాలు పోటెత్తడంతో సోషల్ మీడియా కూడా యాక్టివేట్ అయ్యింది. ఇంత జనం, ఇంత మంది అభిమానులు ఉన్నారు కాబట్టే గత ఎన్నికల్లో కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీని ఈవీఎంలతో మాయ చేశారంటూ ట్రోల్స్ చేస్తున్నారు. ఎన్నికల్లో నేరుగా గెలవలేక ఈవీఎంల ద్వారా మోసగించారని కూటమి ప్రభుత్వంపై ట్రోల్స్ పెరిగాయి.

మీ ఆత్మీయత వెలకట్టలేనిది..

పాలకొండ రూరల్: పరామర్శకు తమ ఇంటికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పట్ల ఈ ప్రాంత వాసులు చూపించిన ఆత్మీయత వెలకట్టలేనిదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ శాసనసభ్యురాలు విశ్వారాయి కళావతి అన్నారు. శుక్రవారం వీరు విలేకరులతో మాట్లాడుతూ.. రాజు ఎక్కడ ఉన్నా రాజేనన్నారు. ప్రజల మనసుల్లో జగనన్నకు ఉన్న స్థానం ఏమిటో ప్రజలు ప్రత్యక్షంగా చూపించారని తెలిపారు. తండ్రి మరణం తర్వాత తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ విక్రాంత్ కృతజ్ఞతలు తెలియజేశారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



రీ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పాలకొండ: సమగ్ర భూ రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని మంగళాపురంలో చేపడుతున్న రీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రైవేట్ భూములతో పాటు గ్రామ సరిహద్దులు, నీటివనరుల గల భూములు, పోరంబోకు భూముల కొలతలు వేసి కచ్చితమైన సరిహద్దులు నిర్ణయించడం జరుగుతుందన్నారు. రీ సర్వేలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో 740 ఎకరాల్లో రీ సర్వే చేయాల్సి ఉండగా ఇంతవరకు 584 ఎకరాల్లో సర్వే పూర్తి చేశామని తహసీల్దార్ బాల మురళీకృష్ణ తెలిపారు. ఆయనతో పాటు సబ్ కలక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, రీ సర్వే డీటీ సన్యాసిరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యూపీ, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పేదరిక నిర్మూలనపై శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు పర్యవేక్షించారు. అలాగే పెయింటింగ్, డిబేట్ పోటీలను కూడా నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

వినతిపత్రం అందజేత

జియ్యమ్మవలస:

పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కె.సీతారాం, బి.మోహనరావులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారంతా మండల కేంద్రంలో ఇన్‌చార్జ్ తహసీల్దారు ఆర్.పకీరును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని, ఆ దిశగా నిధులు మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లాకు నిధులు కేటాయించాలి..

పాలకొండ: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో జిల్లాకు పదివేల కోట్ల రూపాయలు కేటాయించాలని సీపీఎం నాయకుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధి చెందాలంటే అధిక మొత్తంలో నిధులు అవసరమన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గతేడాది కంటే తక్కువగా ఉందన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి ఆర్థిక కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకావాల్సి ఉందని తెలిపారు. అనంతరం తహసీల్దార్ బాలమురళీకృష్ణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ. లక్ష్మణరావు, కాద రాము, ఎస్. నారాయణరావు పాల్గొన్నారు.

మాతృభాష గొప్పతనం తెలుసుకోండి



పాలకొండ రూరల్: మాతృభాష గొప్పతనం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు బొరోతు శంకరరావు మాట్లాడుతూ.. మాతృభాష వినియోగం పల్లెల్లో ఎలా ఉంటుందో సోదాహరణంగా విద్యార్థులకు వివరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు నేతృత్వంలో మాతృభాషా దినోత్సవం జరిగింది.

ఉపాధి పనుల పరిశీలన



మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీహరిరావు

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీడీ జి.శ్రీహరిరావు శుక్రవారం పరిశీలించారు. జాబ్ కార్డు ఉన్న వారినే పనిలోకి అనుమతించాలని, పనిలో ఉన్న వారికే మస్తరు వేయాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయిస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు.

సక్రమంగా సేవలందించాలి

జియ్యమ్మవలస: శిఖబడి గ్రామంలో ఎంపీడీవో ఎస్.రమేష్ శుక్రవారం పర్యటించారు. అక్కడి సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి, రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రజలకు అవసరమైన సేవలు సక్రమంగా అందించాలని సూచించారు. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు.

వ్యాసరచన పోటీలకు స్పందన

గరుగుబిల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పేదరికం లేని భారతదేశం అనే అంశంపై మండల స్థాయి వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారిని బహుమతులకు ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఎల్.పాత్రుడు తెలిపారు.

వాట్సాప్‌లో హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

గుమ్మలక్ష్మీపురం: ఇంటర్మీడియట్ విద్యార్థులంతా ఫోన్ నంబర్ 9552300009ను సంప్రదించి, వాట్సాప్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సుధాకర్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ముందుగా ఆ నంబర్‌కు హాయ్ అని వాట్సాప్‌లో మెసేజ్ చేస్తే ప్రభుత్వ సర్వీసులు డిస్‌ప్లే అవుతాయని, అందులో విద్యాశాఖను ఎంపిక చేసుకుని విద్యార్థి ఆధార్ నంబర్ లేదా రోల్ నంబర్ టైప్ చేయాలని ఆ తర్వాత పుట్టిన తేదీ ఇస్తే పీడీఎఫ్ రూపంలో హాల్‌టికెట్ వస్తుందని, దానిని జిరాక్స్ తీసుకోవాలని తెలిపారు. అలాగే http:// bie.ap.gov.in/. వెబ్‌సైట్‌ను ఆశ్రయించి కూడా హాల్‌టికెట్లు పొందవచ్చన్నారు.

తప్పిన ప్రమాదం

కొమరాడ: మండలంలోని స్వామినాయుడువలస గ్రామ సమీపంలోని అంతర్‌రాష్ట్ర రహదారి ఆనుకుని ఉన్న పంటపొలాల్లోకి అటువైపుగా వెళ్తున్న ఓ ఆటో దూసుకెళ్లి పల్టీ కొట్టింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనలో అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ నీలకంఠం తెలిపారు.

శతశాతం పనులు కల్పించాలి

పాలకొండ రూరల్: జాబ్‌కార్డులు కలిగి ఉన్న ప్రతి ఒక్క వేతనదారుకీ శతశాతం పనులు కల్పించాలని ఎంపీడీఓ వీవీ.రంగారావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో 32 పంచాయతీల పరిధిలో ప్రస్తుతం గుర్తించిన పనులు, జరుగుతున్న పనుల తాజా స్థితిగతులు, వేతనదారుల సంఖ్య, పనులకు హాజరవుతున్న వేతనదారుల వివరాలను ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మ ఎంపీడీఓకు వివరించారు. వేసవి నేపథ్యంలో పనులు జరిగేచోట టెంట్లు వేయడం, ఉదయం 7 గంటల నుంచి 11 వరకు.. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు పనులు చేయించాలన్నారు. వేతనదారులే తాగునీరు తెచ్చుకునేలా అంగాహన కల్పించాలని ఎంపీడీఓ సూచించారు.

రోగులకు మెరుగైన వైద్యం : మండల ప్రత్యేకాధికారి



రికార్డులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

గరుగుబిల్లి: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు సూచించారు. మండలంలోని రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. రోగులకు సిబ్బంది అందిస్తున్న సేవలు, మందుల నిల్వలను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో సరైన వైద్యం అందించాలని, రోగి ఆరోగ్యం కుదుటపడేలా సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అక్కడి నుంచి కేజీబీవీని సందర్శించిన ఆయన.. పదో తరగతిలో పరీక్షల్లో శతశాతం ఫలితాల సాధనకు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థినులు రక్తహీనత బారినపడకుండా పౌష్టికాహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి..



ప్రహరీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ ఈఈ రవి

జియ్యమ్మవలస: మండలంలోని లింగాలవలస, అల్లువాడ పాఠశాలలు, శిఖబడి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ చేపడుతున్న ప్రహరీ నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఈఈ జి.రవి, ఎంపీడీవో ఎస్.రమేష్‌లు శుక్రవారంపరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని వారు సూచించారు. పనులు సక్రమంగా లేకపోతే బిల్లులు నిలుపుదల చేస్తామన్నారు.

రహదారి నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: వాహన చోదకులు తప్పనిసరిగా రహదారి నియమాలు పాటించాలని ఎస్సై వై.అమ్మన్నరావు అన్నారు. శుక్రవారం స్థానిక దోనుబాయి కూడలి వద్ద రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు.

మజ్జిగ ద్రావణం తయారీపై అవగాహన



మహిళా రైతులతో మజ్జిగ ద్రావణం తయారు చేయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మొరమ గ్రామంలో మజ్జిగ ద్రావణం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం గుమ్మలక్ష్మీపురం యూనిట్ ఇన్‌చార్జ్ కిమిడి భూషణ్ మాట్లాడుతూ జీడిమామిడి పూత, పిందె రాడిపోకుండా ఉండేందుకు పుల్లని మజ్జిగ ద్రావణం పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. అలాగే ఆకుమచ్చ, కాయమచ్చ, బూజు తెగుళ్ల నివారణకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఎకరా విస్తీర్ణంలోని తోటపై 100 లీటర్ల నీటిలో 6 లీటర్ల మజ్జిగ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది టి.నీరజ, ఎస్.పద్మ, దీప, నవ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం ఆకాంక్షించారు. అదే కళాశాలలో యాన్యువల్ డే శుక్రవారం నిర్వహించారు. విద్యార్థి దశ జీవితంలో ఎంతో ముఖ్యమైన దశ అని, విద్యార్థిగా ఉన్నప్పుడే ఉన్నతమైన విలువలు కలిగి ఉండాలని తెలిపారు. గురువులు, తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. వాటిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌తో ఫోన్ నంబర్ లింక్ తప్పనిసరి..



ప్రతిఒక్కరూ ఆధార్‌తో ఫోన్ నంబర్ లింక్ చేసుకోవాలని ఎంపీడీఓ కె. గీతాంజలి తెలిపారు. సీతంపేట, గొయిది సచివాలయాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చిన్నపిల్లలకు ఆధార్ చేయించుకోవాల్సిన వారు సచివాలయాలను సంప్రదించాలన్నారు. – సీతంపేట

ప్రత్యేక పూజలు..

పాలకొండ పట్టణంలోని సీతారామస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. అర్చకులు ఆయనకు సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, ఆలయ విశిష్టతను కలెక్టర్‌కు వివరించారు. – పాలకొండ



హోమం..



వీరఘట్టం మండల కేంద్రంలోని గణలక్ష్మీ సంతోషిమాత ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక హోమం నిర్వహించారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో భక్తులు హోమంలో పాల్గొన్నారు. – వీరఘట్టం

విగ్రహ ప్రతిష్ఠ...

భామిని మండలం బాలేరులో నదీ తీరంలో నిర్మించిన మందిరంలో యోగముద్రలో ఉన్న ఈశ్వరుడి విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరవెల్లి బాలభాస్కరశర్మ పాల్గొన్నారు. – భామిని

